కుటుంబ పాలనతో రాష్ట్రం కుదేలు 7
8 ఘనంగా శ్రీపాదరావు జయంతి


మూలన పడ్డ మగ్గాలు

'చేనేత' ఎన్నికలు ఎప్పుడో?

- చేనేత సొసైటీలకు ఎన్నికలు లేక ఐదేళ్లు
- ప్రశ్నార్థకంగా మారిన సొసైటీలు
- ఫిబ్రవరితో ముగిసిన ఇన్‌చార్జీల కాలపరిమితి
- రెండు, మూడు రోజుల్లో మళ్లీ పొడిగింపు ఉత్తర్వులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో చేనేతకు ఖండాంతర ఖ్యాతిని నేతన్నలు అందిస్తున్నా ఎన్నికల కోసం నేత కార్మికులకు నిరీక్షణే మిగులుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత స్ఫూర్తిని జాతీయ దినోత్సవాల వేళ ఆర్భాటంగా చాటుతున్నారు. ఎంతో హంగామాగా వేడుకలు నిర్వహిస్తున్నా ఆదర్శప్రాయంగా నిలిచిన చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించక ఐదేండ్లు గడిచిపోయింది. గత ప్రభుత్వం ఈ సంవత్సరం ఫిబ్రవరి వరకు 12వ సారి ఉత్తర్వులు ఇచ్చిన ఇన్‌చార్జి పాలన ముగిసిపోయింది. మరో రెండు మూడు రోజుల్లో 13వసారి కూడా ఇన్‌చార్జిల పాలననే పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉందని తెనుస్తోంది. కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే ఆసక్తి కూడా కార్మికుల్లో నెలకొంది. మరోవైపు చేనేత పోరు ఉంటుందా... సొసైటీలు రద్దు చేస్తారా అనే సందిగ్ధం నేత కార్మికుల్లో కొనసాగుతోంది. ఐదేళ్లకొకసారి నిర్వహించాల్సిన చేనేత సహకార సంఘాల ఎన్నికలు 2013లో చివరి సారిగా నిర్వహించారు. వీరి పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. ఎన్నికలు నిర్వహించాలని 40 రోజుల ముందే నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చేనేత కార్మికులతో ఓటు హక్కు అర్హత కలిగిన జాబితాను జౌళిశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. గత ప్రభుత్వం మాత్రం ఎన్నికలు నిర్వహించకుండా జీవో నంబర్ 568, ద్వారా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలను ప్రభుత్వం నియమించింది. ఇన్‌చార్జిల పదవీకాలం ముగిసిపోయినా ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు.

● సంఘాలు రద్దవుతాయా?

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో రద్దు చేస్తారనే అనుమానాలు సొసైటీ సభ్యుల్లో వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వం ఐదేళ్లుగా ఎన్నికలు జరపకపోవడంతో పాటు తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్, పవర్‌లూం కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం టెస్కో ఉనికి ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది. సహకార సంఘాలకు పని కల్పించడం, అవి తయారు చేసిన బట్ట ఉత్పత్తులను కొనుగోలు టెస్కో చేసేది. రెండు కార్పొరేషన్‌లు ఏర్పడడంతో టెస్కో మూతపడుతుందని భావిస్తున్నారు. ఆక్రమంలోనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపడం లేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో సంఘాల అభివృద్ధి కుంటుపడడమే కాకుండా చేనేత కార్మికులకు సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు కలుగుతున్నాయని తెలుస్తోంది.

● మూగబోయిన సహకార సొసైటీలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చేనేత మగ్గాలపై తళుక్కున మెరిసే జరీపోగుల చీరలు కళకళాడేవి. చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు రావడంతో యువకులు మరమగ్గాల వైపు వెళ్లిపోయారు. ప్రస్తుతం మిగిలిపోయిన అరకొర చేనేత మగ్గాలపై వృద్ధులే ఉపాధి పొందుతున్నారు. మరమగ్గాల చప్పుళ్ల మధ్య చేనేత సహకార సొసైటీలు మూగబోయాయి. జిల్లాలో రికార్డుల ప్రకారం 13 సొసైటీలు ఉన్నారు. ఆరు సొసైటీలు మాత్రమే పనిచేస్తున్నాయి. చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు చేరాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 35 వేల మరమగ్గాలపై బట్ట ఉత్పత్తి జరుగుతోంది. 1984లో సిరిసిల్ల జిల్లాలో చేనేత మగ్గాలు ఆరు వేల వరకు ఉండగా ఇప్పుడు 204 మగ్గాలకు చేరుకున్నాయి. ఈ మగ్గాలపై 325 మంది కార్మికులు మాత్రమే ఉపాధి పొందుతున్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత మిత్ర పథకాన్ని అందిస్తున్నారు. నూలు సబ్సిడీని ఇస్తున్నారు. ఈ పథకం ద్వారా 384 మంది కార్మికులకు రూ 4.21 లక్షలు విడుదల చేశారు. రూ లక్ష వరకు రుణమాఫీ చేశారు. చేనేత కళను బతికించడానికి కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా అప్పటి ప్రభుత్వం 2017లో చేనేత లక్ష్మి పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ శాఖల ఉద్యోగులు 2,662 మంది పథకంలో చేరారు. చేనేత లక్ష్మి పథకంలో చేరిన ఉద్యోగులు బట్టలు కొనుగోలు చేశారు. ఈ పథకం మళ్లీ కొనసాగలేదు. వేములవాడ కేంద్రంగా కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్‌గా గుర్తించింది. క్లస్టర్ కింద రూ 1.19 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీనిలో భాగంగా రూ 50 లక్షలతో మౌలిక వసతుల కేంద్రం ఆధునిక డిజైనతో కార్మికులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. మొదటి విడతలో రూ 19.10 లక్షలు విడుదల చేయగా 300మంది లబ్ధిదారులు కొత్త డిజైన్ల అభివృద్ధి, చేనేత శిక్షణను పొందారు. జిల్లాలో 175 మగ్గాలు ఉండగా అందులో కొన్ని వినియోగంలో లేవు. జిల్లాలో సిరిసిల్లలో 76 మగ్గాలు, వేములవాడలో నాలుగు, వేములవాడ మండలంలో ఏడు, చందుర్తిలో ఎనిమిది, బోయినపల్లిలో 27, తంగళ్లపల్లిలో 34, ఇల్లంతకుంటలో నాలుగు, గంభీరావుపేటలో ఒకటి, కోనరావుపేటలో 14 ఉన్నాయి. ఇందులో సిరిసిల్లలో మహేశ్వర సొసైటీ, సిరిసిల్ల సొసైటీ, జగదాంబ సొసైటీ, వేములవాడ, హన్మాజీపేట, మామిడిపల్లి సొసైటీలతో పాటు ఖాదీగ్రామోద్యోగ్, తంగళ్లపల్లి సొసైటీల్లో చేనేత మగ్గాలు కార్మికులకు ఉపాధిని అందిస్తున్నాయి. చేనేత కార్మికుడికి పదిహేను రోజుల పాటు కష్టపడితే 500 రూపాయల నుంచి 800 రూపాయలవరకే కూలి లభిస్తోంది. చేనేత మగ్గాలకు కండెలు చుట్టే వృద్ధ మహిళలు ఒక నూలు లడి చుడితే ఆరు రూపాయల నుంచి 10 రూపాయలు మాత్రమే లభిస్తాయి. పొద్దంతా చుడితే 50 రూపాయలు మాత్రమే వస్తాయి. చీరలోని గొప్పతనాన్ని చాటుతూ అగ్గిపెట్టెలో సైతం అమిరే చీర, కుట్టులేని దుస్తులు, మగ్గంపై మనుషుల చిత్రాలను నేసి ప్రపంచాన్ని అబ్బురపరిచిన సిరిసిల్ల చేనేత పరిశ్రమ ఉనికిని మాత్రం కొందరు యువకులు బతికించే ప్రయత్నం చేస్తున్నారు. వారుకూడా మరమగ్గాలపైనా ప్రయోగాలు చేయడంపై దృష్టి పెట్టారు.

నేడే పల్స్ పోలియో కార్యక్రమం

- జిల్లాలో 44,770 మందికి చుక్కల లక్ష్యం


మాట్లాడుతున్న రజిత

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పోలియో రహిత సమాజం కోసం ప్రతియేటా ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నామని, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కల మందు వేయించాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ రజిత కోరారు. శనివారం పల్స్ పోలియో ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో 394 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం ఏడు గంటల నుంచి పల్స్ పోలియో చుక్కలు వేస్తామన్నారు. జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు ఉన్న 44,770 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని రెండు పోలియో చుక్కలు నిండు జీవితాన్ని ఇస్తాయని తెలిపారు. 394 కేంద్రాలు, 25 మొబైల్‌టీమ్‌ల ద్వారా ఆదివారం నిర్వహించే పల్స్ పోలియోలో చుక్కలు వేసుకోని వారికి 4, 5, తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి వేస్తారని పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సమానమైన హక్కులతో పాటు ప్రత్యేకమైన చట్టాలను కూడా ప్రభుత్వం అందించిందని చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. శనివారం సిరిసిల్లలో నర్సింగ్ కళాశాలలో మహిళల శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకంగా గృహ హింస నిరోధక చట్టం పని ప్రదేశాల్లో లైగింక వేధింపుల నివారణ చట్టం, నిర్భయ చట్టం వంటి వాటిని అందించారని తెలిపారు. ఏ సందర్భంలోనైనా మహిళలు ఇబ్బందులకు గురైతే 181 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వైద్యం, న్యాయం, పోలీస్ కౌన్సెలింగ్, రక్షణ వంటివి పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ, సూపర్‌వైజర్లు దివ్య, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): మహిళలకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలతో పాటు అందరితో సమాన హక్కులను కల్పిస్తుండడంతో అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నాబార్డు ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డిపేట ఎంపీటీసీ పందిర్ల నాగరాణి హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా, అంగన్వాడి సూపర్‌వైజర్ సరిత, సఖి కేంద్రం ఇన్‌చార్జిలు విజయ, దేవిక, మహిళలు పాల్గొన్నారు.

వేములవాడ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వర్


బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేశ్వర్

వేములవాడ, మార్చి 2: వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎస్ రాజేశ్వర్ శనివారం విధుల్లో చేరారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన పి మధుసూదన్‌ను జగిత్యాలకు బదిలీ చేశారు. కోరుట్ల నుంచి ఎస్ రాజేశ్వర్‌ను వేములవాడ ఆర్డీవోగా నియమించారు. ఈ మేరకు శనివారం నాడు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిరిసిల్లలో కలెక్టర్ అనురాగ్ జయంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సిరిసిల్ల కలెక్టరేట్: సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని వేములవాడ ఆర్డీవోగా నూతనంగా విధుల్లో చేరిన ఎస్‌రాజేశ్వర్ శనివారం మార్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 2: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై శనివారం స్వీప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిరిసిల్ల పట్టణంలోని నర్సింగ్ కళాశాలతో పాటు అగ్రహారం పాలిటెక్నిక్, బద్దెనపల్లి, జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో అందుబాటులో ఉన్న సేవలు ఓటు హక్కు నమోదు, అర్హత, వయస్సు ఆన్‌లైన్, అఫ్‌లైన్‌లో ఓటు హక్కును ఎలా నమోదు చేయాలి, ఫారం 6, 7, 8 వినియోగం ఓటు హక్కు నమోదులో తరచూ చేసే తప్పులు ఎలా నివారించాలి. వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజ్‌గోపాల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లి మేరీ, వైస్ ప్రిన్సిపాల్ విజయకుమారి, అధికారులు శ్రీదేవి, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీటీడీఏ పనుల్లో వేగం పెంచండి

- మహాశివరాత్రి జాతరకు సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలి - కలెక్టర్ అనురాగ్ జయంతి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ)ద్వారా చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో వీటీడీఏ చేపట్టిన పనులు, మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు, లైబ్రరీ నిర్మాణ పనులు, ల్యాండ్ పూల్లింగ్‌పై సమీక్షించారు. బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు త్వరగా మొదలు పెట్టాలని సూచించారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్‌ను ఆదేశించారు. వేములవాడకు వచ్చే అన్ని రహదారుల్లో ఎక్కడైనా ప్యాచ్ వర్క్‌లు ఉంటే సరిచేయాలని చెత్తాచెదారం లేకుండా చేయాలన్నారు. పర్యాటక శాఖ ద్వారా చేపడుతున్న గుడి చెరువు అభివృద్ధి సుందరీకరణ పనులు పక్కా ప్రణాళికతో చేపట్టాలని ప్రతీ వారం పనులపై నివేదిక ఇవ్వాలన్నారు. ఓపెన్ క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. ఆధునిక టాయిలెట్‌ల సౌకర్యాం కల్పించాలని సూచించారు. ల్యాండ్‌పూల్లింగ్ పనులు, వేములవాడ లైబ్రరీ నిర్మాణ పనులతో పాటు, వేములవాడ మహాశివరాత్రి జాతర ఏర్పాట్ల పురోగతిపై ఆరా తీశారు. జాతర ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో పూజలు, దర్శనాలు, ఇతర ఆన్‌లైన్ సేవలపై భక్తులకు అవగాహన కల్పించాలని అలాగే ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని సూచించారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పంచాయతీరాజ్ ఈఈ సూర్యప్రకాష్, అర్అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆలయ ఈఈ రాజేష్, తహసీల్దార్ మహేష్ కుమార్, టూరిజం డీఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో నేడే 5కె రన్

సిరిసిల్ల క్రైం, మార్చి 2: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో 5కె రన్ నిర్వహిస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 5కె రన్‌లో ఆసక్తి గల యువతీ, యువకులు, విద్యార్థులు, ఉద్యోగస్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఆదివారం 5కె రన్ ఉదయం 6గంటలకు ప్రారంభమై తిరిగి చంద్రంపేట క్రాస్‌రోడ్డు నుంచి అంబేద్కర్‌చౌరస్తా వద్ద ముగుస్తుందన్నారు. ఈ 5కె రన్‌లో విజేతలైన 13మందికి సైకిళ్లు బహుమతిగా అందజేస్తామన్నారు. 5కె రన్‌లో పాలుపంచుకునే ప్రతి ఒక్కరికి టీ షర్ట్ అందజేస్తామని తెలిపారు. 5కె రన్‌లో మొదటి మూడు బహుమతులు పోలీస్, పాత్రికేయులు, సిటీజన్స్, మిగితా మండలాలవారికి బహుమతులు అందజేస్తామన్నారు.

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట: యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న 5కె రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీర్నపల్లి ఎస్సై రమేష్, ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం చేపట్టాల్సిన చర్యలను ప్రత్యేక నిపుణులతో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. యువతీ, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట, మార్చి 2: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మార్నింగ్‌వాక్ కార్యక్రమంలో భాగంగా శనివారం పొత్తూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే నాలుగు పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. మిగతా పథకాలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తారని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీఒక్కరికి అందేలా అధికారులు చూడాలన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు మండలపరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలు విశ్వాసం ఉంచి ఎన్నుకున్నార ని వారి ఆశయాలను అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భం గా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన ప్యాక్స్‌డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి పాల్గొన్నారు.

కరీంనగర్ టికెట్ బండి సంజయ్‌కే

- లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించిన బీజేపీ - కరీంనగర్ జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

భారతీయ జనతా పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి నిలిపే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే శనివారం సాయంత్రం 195 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించగా, అందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు తొమ్మిది మంది ఉన్నారు. కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి మళ్లీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కే అవకాశం కల్పించారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు మల్కాజిగిరి టికెట్ దక్కింది. అధికారికంగా శనివారం వరకు టికెట్ ఎవరికి ఇచ్చేది ప్రకటించకున్నా కరీంనగర్ స్థానంలో తానే పోటీ చేయడం ఖాయమన్న ధీమాతో బండి సంజయ్‌కుమార్ నెల రోజుల క్రితం నుంచే లోక్‌సభకు పోటీ చేసేందుకు సన్నద్ధమవుతూ వచ్చారు. నియోజక వర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో విస్తృత పర్యటనలు చేసి పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తు సమావేశాలు నిర్వహించారు. ప్రజాహిత యాత్రను చేపట్టి తొలి విడతలో 119 కిలోమీటర్ల పొడవునా సిరిసిల్ల, వేములవాడ నియోజక వర్గాల పర్యటనను పూర్తి చేసుకుని ప్రస్తుతం మలివిడత యాత్రలో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి కిసాన్ మోర్చా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి పొల్సాని సుగుణాకర్‌రావు పోటీ చేసేందుకు టికెట్ ఆశించి ముమ్మర ప్రయత్నాలు చేసినా చివరకు బండి సంజయ్‌కుమార్ దానిని తిరిగి దక్కించుకున్నారు. 2019లో మొదటిసారి కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన సంజయ్ 90 వేల ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌పై గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయినా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం విజయం సాధించి ఏడాది తిరగక ముందే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలను చేపట్టారు. మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగి రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పార్టీ బీజేపీయేననే వాతావరణాన్ని తీసుకువచ్చారు. అధ్యక్ష పదవి నుంచి ఆయన వైదొలిగిన తర్వాత పార్టీ జాతీయ నాయకత్వం ఆయనకు జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టింది. ప్రస్తుతం జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలలో ముక్కోణపు పోటీ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బీఆర్‌ఎస్ ఇప్పటికే కరీంనగర్ స్థానంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించగా, ఇప్పుడు బండి సంజయ్‌కుమార్ బీజేపీ అభ్యర్థిగా ఆ పార్టీ నాయకత్వం పేర్కొన్నది. త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించనుండగా ఇక్కడ ముక్కోణపు పోటీ ఖాయమైంది. ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీలో చురుకైన కార్యకర్తగా పనిచేసిన బండి సంజయ్‌కుమార్ కీలక పదవులు చేపట్టారు. యువజన విభాగమైన యువమోర్చాలో కూడా ఆయన చురుకైన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. బీజేపీ అగ్రనేత ఎల్‌కే అడ్వాణీ రథయాత్రలో పాల్గొన్నారు. కరసేవలో సంజయ్ పాల్గొని హిందుత్వవాదిగా ముద్రపడ్డారు. కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో రెండుసార్లు కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందిన ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం రెండుసార్లు ఓడి పోయారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఏర్పాటుపై ప్రజల్లో వ్యక్తమైన సానుకూలత హిందుత్వవాదిగా పేరుపడ్డ సంజయ్‌కి కలిసి వచ్చింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో ఆయన గెలుపొంది జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే కేంద్ర మంత్రి పదవి వరిస్తుందన్న ప్రచారం కార్యకర్తలు, నాయకుల్లో ఇప్పటికే జోరందుకోవడంతో ఆ విజయాన్ని ఖాయం చేసుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

● ఈటల రాజేందర్‌కు మల్కాజ్‌గిరి..

జిల్లాకే చెందిన బీజేపీ నాయకుడు ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌కు ఆ పార్టీ అగ్రనాయకత్వం మల్కాజ్‌గిరి అభ్యర్థిత్వాన్ని ఖాయం చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈటల రాజేందర్ హుజూరాబాద్ నియోజక వర్గం నుంచే కాకుండా గజ్వేల్‌లో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పోటీకి దిగారు. ఈ రెండు స్థానాల్లోను ఆయన ఓడిపోయారు. మల్కాజ్‌గిరి నుంచి పలువురు సీనియర్లు ముఖ్యంగా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పొల్సాని మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మల్క కొమురయ్య పోటీపడ్డా పార్టీ జాతీయ నాయకత్వం ఈటల రాజేందర్ అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపింది. బీసీ నాయకుడిగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు ఉన్న సంబంధాల కారణంగా ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమించిన నాయకత్వం ప్రస్తుతం లోక్‌సభకు కూడా పోటీకి దింపుతున్నది. జిల్లాకు చెందిన ఇద్దరికి తొలి జాబితాలో చోటు దక్కడంపై బీజేపీ జిల్లా శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.

● బీజేపీ నాయకుల సంబురాలు..

సిరిసిల్ల రూరల్: కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు రెండోసారి అధిష్ఠానం టికెట్ ఖరారు చేయడంతో శనివారం రాత్రి సిరిసిల్లలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంటరీ కోకన్వీనర్ అడెపు రవీందర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మీ, పట్టణ అధ్యక్షురాలు పండుగ మాధవి, పట్టణ ప్రధాన కార్యదర్శులు కైలాష్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంటా అశోక్, ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు రాజిరెడ్డి, సీనియర్ నాయకులు పురం రాజు గౌడ్, డాక్టర్ సత్యనారాయణగౌడ్, గుర్రపు నాగరాజు, మల్లేష్ యాదవ్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

నకిలీ చిరునామా కేసులో మీ సేవా కేంద్రం నిర్వాహకుడు, మరొకరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 2: నకిలీ చిరునామాతో పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసిన కేసులో రుద్రంగి మండల కేంద్రంలో గల గాయత్రి మీ సేవా కేంద్రం యజమాని లోలావత్ పరమజీత్‌ను, కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్‌ను శనివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరి వద్ద నుంచి కంప్యూటర్, స్కానర్, ప్రింటర్, ఒరిజినల్, నకిలీ ఆధార్‌కార్డు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు పాస్‌పోర్ట్ దరఖాస్తు విషయంలో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగులను తప్పు దోవ పట్టించారని తెలిపారు. కథలాపూర్ మండలంలోని కలికోట గ్రామానికి చెందిన దరావత్ షెర్మాన్ అనే వ్యక్తి గతంలో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి అక్కడ జైలు శిక్ష అనుభవించాడు. తిరిగి స్వదేశానికి వచ్చి ఎలాగైనా మళ్లీ విదేశాలకు వెళ్లాలని పాస్‌పోర్ట్‌కోసం మీసేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఇందులో భాగంగా స్పెషల్ బ్రాంచి పాస్‌పోర్ట్ ఎంక్వైరీలో భాగంగా షెర్మాన్ సమర్పించిన పత్రాలు అనుమానంగా భావించి సంబంధిత కానిస్టేబుల్ దేవరాజు రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యా దు మేరకు విచారణ చేపట్టగా రుద్రంగిలోని గాయత్రి మీసేవా కేంద్రం నిర్వాహకుడు లోలావత్ పరమజిత్ ద్వారా ఆధార్ కార్డులో షెర్మాన్‌కు బదు లుగా షెర్మాన్‌నాయక్ అని చిరునామా కలికోట గ్రామానికి బదులుగా రుద్రం గిగా మార్చడమే కాకుండా విద్యార్హతలు, పుట్టిన తేదీలు మార్చి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేశారని ఆయన తెలిపారు. ఈ విధంగా నకిలీ చిరునామా పెట్టి దరఖాస్తు చేసిన వ్యక్తితో పాటు మీసేవా కేంద్రం నిర్వాహకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

52మంది మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 52మంది మందుబాబులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ శనివారం తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 26మందికి ఒక్కొక్కరికి రెండురోజుల జైలు శిక్షతో పాటు మూడువేల రూపాయల జరిమానా విధించారని తెలిపారు. మరో 25మంది మందుబాబులకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ కస్టడీలో అక్షర చిట్‌ఫండ్ చైర్మన్, డైరెక్టర్లు

కరీంనగర్ క్రైం, మార్చి 2: ఖాతాదారులకు సకాలంలో డబ్బు చెల్లించకుండా మోసగించి చిట్‌ఫండ్ కంపెనీలో ఖాతాదారులు జమచేసుకున్న డబ్బుతో సొంత ఆస్తులు కూడబెట్టిన కేసులో అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్ పేరాల శ్రీనివాసరావు, ఎస్ కొండాల్‌రావు, ఉప్పల రాజేందర్‌లను ఒకటవ టౌన్ పోలీసులు ఆరు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. సీతారాంపూర్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి శ్రీరాం వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో ఫిబ్రవరి 21న అక్షర చిట్‌ఫండ్ ఛైర్మన్, డైరెక్టర్లపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు వారిని అదే రోజు అరెస్టు చేసి జైలులో రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు నిందితుల్లో ముగ్గురిని పోలీసులు కోర్టు ద్వారా శుక్రవారం సాయంత్రం కస్టడీకి తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం వరకు వీరిని విచారించనున్నారు. కరీంనగర్ రాజీవ్‌చౌక్, కోతిరాంపూర్, జ్యోతినగర్‌లలో ఉన్న అక్షర చిట్‌ఫండ్ బ్రాంచీలలో తనిఖీలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

గంగాధర, మార్చి 2: కారు ఇంటి పిల్లరును ఢీకొన్న ఘటనలో గంగాధర మండలం కాచిరెడ్డిపల్లికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. గ్రామస్థుల వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన కోల విక్రమ్(31), కుంట రమేష్(32)లతో పాటు మరో ఇద్దరు శనివారం వేకువ జామున కారులో తిరుపతి దర్శనానికి బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఓ ఇంటి పిల్లరును ఢీకొట్టింది. ఈ ఘటనలో కుంట రమేష్ అక్కడి కక్కడే మృతి చెందగా విక్రమ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులోని మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలైనట్లు సమాచారం. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్,మార్చి 2 : మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనాలు ఢీకొని సూర్నపల్లి రాజయ్య (56) మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సబ్బితం గ్రామానికి చెందిన సూర్నపల్లి రాజయ్య స్వగ్రామం నుంచి పెద్దపల్లికి ద్విచక్రవాహనంపై వస్తుండగా మరొకరు రంగాపూర్ గ్రామ శివారులో ద్విచక్రవాహనంతో వెనుకనుండి ఢీకొట్టాడు. రాజయ్య తలకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలు

- అబద్దాల పునాదులపై పురుడు పోసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- దేవుణి మాన్యాలను కబ్జా చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదు
- బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ టౌన్, మార్చి 2: కుటుంబ పాలన, కుంభకోణాలతో రాష్ట్రం కుదేలైందని బీజేపీ ఫ్లోర్ లీడర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందంటే ప్రధాన మోదీతోనేనని, ప్రపంచ దేశాల్లోనే భారత్ మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతుందంటే ప్రధాని మోదీ సంకల్పానికి నిదర్శనమన్నారు. దేశంలో రాబోయేది రామరాజ్యమని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసంగ్రామ యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా వేములవాడకు వచ్చిన ఆయన సమావేశంలో మాట్లాడారు. విజయ సంకల్ప యాత్ర ఒక కొత్త మలుపునకు నాంది పలికిందని అన్నారు. రాజకీయ చరిత్రలో వేడిపుట్టించిందని, రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలువబోతున్నామని విశ్లేషకులు చెబుతున్నారని అన్నారు. వేములవాడకు వచ్చిన తరువాతనే ఓ శుభవార్త తెలిసిందని, రాష్ట్రంలో 9 మంది అభ్యర్థులను ప్రకటించగా కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్ పేరు ఖరారు చేశారని వెల్లడించారు. సుమారు 2 లక్షల మెజార్టీతో బండి సంజయ్ గెలువబోతున్నాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో యేళ్లుగా రాష్ట్రం కుటుంబ పాలనతో విసుగిపోయిందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షల కోట్ల కుంభకోణం జరిగిందని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన తరువాత సీబీఐ ఎంక్వైరీ కోసం ఒక్క లెటర్ ఇవ్వమంటే ఎందుకు ఇస్తలేరని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం ప్రాజెక్టులో ఎవరైనా బంధువులు, మిత్రులు కానీ ఉన్నారా అని ప్రశ్నించారు. నాకు ఒక్క లెటర్ ఇస్తే 48 గంటల్లో సీబీఐ ఎంక్వైరీ పెట్టిస్తానని, దమ్ముంటే ఒక్క లేటర్ ఇవ్వు రేవంత్‌రెడ్డి అని సవాల్ విసిరారు. అధికారం చేజిక్కించుకునేందుకు నోటికి వచ్చిన అబద్దాలు చెపుతూ అధికారంలోకి వచ్చారని, కేవలం బ్లాక్‌మెయిల్ చేయడం కోసమే ముఖ్యమంత్రి పదవి తీసుకున్నాడని ఆరోపించారు. నాలుగు వందల పైచిలుకు హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. ఆరు గ్యారంటీల పేరు చెప్పి నాలుగు అమలు చేశామని అంటున్నారు. అది సాధ్యం కాదని ఆరు గ్యారంటీలు అమలు జరగాలంటే రూ.1.65 లక్షల కోట్లు కావాలని, కానీ రూ.53 వేల కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. గ్యారంటీల అమలు ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తామని, నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని అసెంబ్లీలో మాట్లాడలేదని, వాటిపై తాను ప్రశ్నిస్తే ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మేము హామీ ఇవ్వలేదని మాట దాటవేసిన మహానీయులు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడితప్పి అతలాకుతలం అవుతుందని, ప్రధాని మోదీ రూ. 9 వేల కోట్ల ఇస్తేనే ప్రభుత్వం వడ్డీలు, జీతాలు



వేములవాడలో మాట్లాడుతున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

వెల్లదీస్తోందన్నారు. అలాంటి మోదీని విమర్శించే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. మరో మారు ప్రధానిని విమర్శిస్తే ఖబద్దార్ అని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సీతారాములకు సంబంధించిన 11 వందల ఎకరాలను దేవుడి మాన్యాన్ని అక్కడున్న రంజిత్‌రెడ్డి, కేటీఆర్ కలిసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఇండస్ట్రియల్ పేరుతో రూ.20 లక్షల నుంచి రూ.15 లక్షలకు ఎకరం కేటాయించి కమిషన్‌లు పొందారని ఆరోపించారు. దేవుడి మాన్యాల జోలికి వస్తే ఖబద్దార్, బీజేపీ పార్టీ ఊరుకోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర మతాలకు చెందిన వారి దేవుళ్లకు చెందిన భూమిని తీసుకునే దమ్ము పాలకులకు ఉందా అని ప్రశ్నించారు. హైదారాబాద్ నడిబొడ్డు లోని జూబ్లీహిల్స్‌లో అక్కడి ఎంపీ అని చెప్పుకుని తిరిగే రంజిత్‌రెడ్డి 400 ఎకరాల హనుమాన్ దేవాలయాన్ని కూలగొట్టి అక్కడి భూమిని కబ్జా చేసి అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్నాడని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దమ్ము ధైర్యం వుంటే ఆధారాలతో సహా ఇస్తాను దాన్ని నిలిపివేసి దేవాలయానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ నియోకవర్గంలో సైతం శ్రీకృష్ణుని చెందిన భూమి సైతం కబ్జా చేస్తే సర్వే చేసి వెలికి తీస్తున్నానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, దీప, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మైపాల్‌రెడ్డి, ఎర్రం మహేష్, మల్లికార్జున్, కుమ్మరి శంకర్, గురుమూర్తి శివశంకర్, సంతోష్‌బాబు, జక్కుల తిరుపతి తదితరులు ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న మహేశ్వర్‌రెడ్డి

వేములవాడ టౌన్ : వేములవాడ రాజరాజేశ్వరస్వామిని శనివారం సాయంత్రం బీజేపీ శాసనసభాపక్ష నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ప్రొటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు రేగుల సంతోష్‌బాబు, నామాల శేఖర్, సగ్గు రాహుల్ ఉన్నారు.

కొనసాగుతున్న న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 2: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీ కన్వెన్షన్‌లో ఈ నెల 1న ప్రారంభమైన న్యూరో డాక్టర్ల రాష్ట్రస్థాయి సదస్సు కొనసాగుతోంది. ఈ సదస్సులో శనివారం నిమ్స్ ప్రొఫెసర్ విజయసారథి పాల్గొని ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెన్నెముక చికిత్సలో కోత లేకుండా ఎండోస్కోపీ ద్వారా శస్త్ర చికిత్సలు ఎలా చేయాలని వివరించారు. అనంతరం కిమ్స్ హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహీ మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ ట్యూమర్ చికిత్స తీసుకోవాలంటే ఆరు వారాలు అవసరం ఉండేదన్నారు. ప్రస్తుతం రేడియో సర్జరీ ద్వారా రెండు నుంచి ఐదు రోజులు మాత్రమే చికిత్స తీసుకుంటే సరిపోతుందన్నారు. రోబోటిక్ సర్జరీ, ఎండోస్కోపీ, నావిగేషన్, అల్ట్రాసోనిక్, ఆస్పురేటీవ్, లేజర్‌ల ద్వారా అత్యాధునిక చికిత్స అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వాటితో పాటు మైక్రోస్కోప్ సర్జరీలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ప్రస్తుతం సర్జరీ అవసరం లేకుండానే రేడియేషన్‌తో చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దాంతో పేషంట్ ఒక్క రోజులోనే డిశ్చార్జి అవుతున్నారని తెలిపారు. స్పైనల్ కార్డు స్టీమ్‌లెటర్ అందుబాటులోకి రావడం పక్షవాతానికి గురైన వ్యక్తులకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. న్యూరో విభాగంలో నూతనంగా వస్తున్న మెళకువలను నేర్చుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. డాక్టర్ దాసరి వెంకటేష్ మాట్లాడుతూ రోడ్లు సరిగా లేకపోవడం, ఎక్కువ సేపు ప్రయాణాలు చేయడంతోనే వెన్నుముక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వాటితోపాటు ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం, సరైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడికి గురికావడం కూడా కారణమన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే నివారించవచ్చన్నారు. కార్యక్రమాన్ని కరీంనగర్‌కు చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ పీవీకే కిషోర్, డాక్టర్ దాసరి శ్రీనివాస్, డాక్టర్ జొన్నల శ్రీనివాస్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ సంజయ్‌లు పర్యవేక్షిస్తున్నారు.

12 వరకు ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ పరీక్ష ఫీజు గడువు

గణేశ్‌నగర్, మార్చి 2:ఎస్‌యూ పరిధిలోని ఎం ఫార్మసీ మొదటి సెమిస్టర్ మూడో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12 వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. 300రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలనిఅన్నారు. పరీక్షలను మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

●ఎస్‌యూ పరిధిలోని బీఫార్మసీ మొదటి సెమిస్టర్, ఏడో సెమిస్టర్ (రెగ్యులర్ సప్లిమెంటరీ) రెండో సెమిస్టర్, ఎనిమిదో సెమిస్టర్(సప్లిమెంటరీ) విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం ఈనెల 12వ తేదీ వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు చెల్లించాలని ఆయన అన్నారు.

రేపు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు

సుభాష్‌నగర్, మార్చి 2: సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్నేషనల్ సంస్థలో 400ల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, ఈ నెల 4న నగరంలోని అంబేద్కర్ స్టేడియం సమీపంలోని స్వశక్తి కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని డీఆర్‌డిఏ పిడి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఆపై విద్యార్హతతో పాటు 19 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులన్నారు. తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్ ప్రతులు తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 14 వేల నుంచి 21 వేల వరకు వేతనంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ బోనస్ గ్రాట్యుటీ అందజేస్తారన్నారు.

రేపు ఎస్సారార్ కళాశాలలో జాబ్ మేళా

గణేశ్‌నగర్, మార్చి 2: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జి సెంటర్ (టిఎస్‌కెసి) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, టిఎస్‌కెసి కో-ఆర్డినేటర్ సిహెచ్ మారుతి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఆదర్శ నెక్సా షోరూం పాల్గొంటుందని తెలిపారు. డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు ఎస్సారార్ కళాశాల, టిఎస్‌కెసి సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యావిధానం

భగత్‌నగర్, మార్చి 2: విద్య ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానమని దీనిని ప్రజలందరూ వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు నద్దునూరి అశోక్ స్టాలిన్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 లోపాల పుట్ట అని విమర్శించారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ కోసమే నూతన విద్యా విధానమన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన కరీంనగర్ ఎంపీ ఓట్లు ఎలా అడుగుతారని ఆయన ప్రశ్నించారు. ఎన్ఈపీ రద్దుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడు తున్నా మన్నారు. ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు దూరం చేసే కుట్ర పన్నుతున్నాయన్నారు. దేశంలో జాతీయ విద్యావిధానం వల్ల 90శాతం మంది విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే హక్కును కోల్పోతారన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు



సమావేశంలో మాట్లాడుతున్న నద్దునూరి అశోక్‌స్టాలిన్

రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, అడపా సాయికృష్ణ, వినయ్‌రెడ్డి, అజయ్ రాహుల్, నాని, సుధీర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో బీజేపీ నాయకుడు, మరో ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 2: సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడి భూమిని నకిలీ పత్రాలు సృష్టించి అక్ర మంగా కాజేసేందుకు ప్రయత్నించడమే కాకుండా చం పుతామని బెదిరించిన సంఘటనలో బీజేపీ నాయకుడితో పాటు మరో ఇద్దరిపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ వివరా ల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని గూడూరి ప్రవీణ్‌కు చెందిన సర్వేనంబర్ 1562లో 363గజాల భూమిని అక్ర మించాలనే ఉద్దేశంతో తప్పుడు దస్తావేజులతో కె చందన భూమిని చౌటుపల్లి చంద్రశేఖర్‌కు జీపీఏ చేశారు. ఆ తర్వాత చౌటుపల్లి చంద్రశేఖర్ అదే భూమిని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపికి విక్రయించారు. గోపి ఈ భూమిలో నుంచి 180గజాల భూమిని తిరిగి కె చందన కు రిజిస్ట్రేషన్ చేశారు. భూమిని తమకు అప్పగించాలని లేకుంటే చంపుతామని బెదిరించారని బాధితుడు బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు గూడూరి ప్రవీణ్ ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని, వారి నేర ప్రవృత్తిని ప్రజలు ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

జార్జియాలో వైద్య విద్యార్థిని మృతి

హుజూరాబాద్‌రూరల్, మార్చి2: హుజూరాబాద్ మండలంలోని జూపాక గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని పంజాల రిచిత(20) అనారోగ్యంతో జార్జియాలో శనివారం మృతి చెందింది. గ్రామానికి చెందిన పంజాల రాజు కుమార్తె రిచిత జార్జియాలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజుల క్రితం రిచిత ఊపిరి తిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకి పరిస్థితి విషమించింది. తోటి విద్యార్థులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.


పంజాల రిచిత(ఫైల్)

యువకుడి ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 02 : మండలంలోని వెల్లుల్ల గ్రామంలో కేటీఆర్‌నగర్‌కు చెందిన నేరెళ్ల హరీష్(25) అనే యువకుడు ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చిరంజీవి శనివారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నేరెళ్ల హరీష్ ఓ యువతిని కొంత కాలం నుంచి ప్రేమించాడు. ఆ అమ్మాయికి వేరే వ్యక్తితో పెళ్లి కుదిరింది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన హరీష్‌ను ఫిబ్రవరి 29న మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి తల్లి తీసుకెళ్లింది. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న హరీష్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మహిళ ఆత్మహత్య


శ్రీలత(ఫైల్)

జ్యోతినగర్, మార్చి 2: కొడుకు చనిపోతానని బెదిరించడంతో నువ్వు ఎందుకు చనిపోవడం కొడుకా..నేనే చనిపోతా అంటూ క్షణికావేశంలో ఓ తల్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో చోటుచే సుకుంది. ఎస్ఐ ఉదయకిరణ్ కథనం ప్రకారం.. ప్రగతినగర్‌కు చెందిన పైండ్ల శ్రీలత (40) రవి దంపతులకు రాజ్‌కుమార్, అక్షితలు సంతానం, రాజ్‌కుమార్ హన్మకొండలో డిప్లమో చదువుతున్నాడు. వృధాగా డబ్బులు ఖర్చు పెడుతుండటంతో కొడుకు రాజ్‌కుమార్‌ను తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపం చెందిన రాజ్‌కుమార్ తన తల్లి శ్రీలతకు ఈ నెల ఒకటిన రాత్రి ఫోన్ చేసి తన అవసరాలకు ఖర్చులకు డబ్బులు పంపించడం లేదని చనిపోతానని చెదిరించాడు. నువ్వు ఎందుకురా చని పోవడం నేనే చచ్చిపోతా అంటూ తల్లి శ్రీలత క్షణికా వేశంలో ఇంట్లో ఉన్న డీజిల్ డబ్బాలోని డీజిల్‌ను ఒంటి పై పోసుకుని నిప్పంటించుకుంది. గోదావరిఖని ప్రభుత్వ అసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోందని డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి2 : మండలంలోని వేంపేట గ్రామంలో పశువుల కాపారి కోడి స్వామి(48) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. మంచిర్యాల జిల్లా లక్సెట్‌పేట్ మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కోడి స్వామి జీవనోపాధి కోసం మండలంలోని వేంపేట గ్రామానికి కొన్ని సంవత్సరాల క్రితం కుటుంబ సభ్యులతో వచ్చాడు. శుక్రవారం పశులవులను మేపుకుంటూ గ్రామంలోని పెద్ద చెరువు సమీపం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. శనివారం చెరువులో కోడి స్వామి శవమై స్థానికులకు కనిపించగా కుటుంబ సభ్యులకు సమచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 2: ప్రమాదవశాత్తు కాలు జారి భవనంపై నుంచి కింద పడిన ఒడిస్సా కార్మికుడు అజిత్‌కుమార్ వాస్(34) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కరీంనగర్ రేకుర్తిలోని విజయపురి కాలనీలో భూక్య రాజు అనే ఇంటి యజమాని వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న అజిత్‌కుమార్ వాస్ శుక్రవారం ఉదయం ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా రెండో అంతస్తుకు వెళ్లి కాలు జారి కిందపడ్డాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నెలనెలా పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 2: యూనిక్ కంపెనీ ఏజెంట్ పేరుతో నెల నెల పొదుపు డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వెంకటాపూర్ గ్రామానికి చెందిన సునీల్ యూనిక్ కంపెనీ ఫేక్ ఏజెంట్ అని తేలడంతో బాధితులు ఆయన ఇంటిని ముట్టడించారు. పొదుపు చేసిన డబ్బులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు 500 మంది బాధితుల నుంచి మూడు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. మోసం చేసిన వ్యక్తి ఇంటిని ముట్టడించిన ఫలితం లేకపోవడంతో న్యాయం చేయాలంటూ బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్తి వివరాలు సేకరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్సై రమాకాంత్ హామీ ఇచ్చారు.


పోలీసులను ఆశ్రయించిన బాధితులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వీణవంక,మార్చి2: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన తాటికొండ రమణారెడ్డి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. నాలుగు రోజుల క్రితం రమణారెడ్డి కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయం చుసిన గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబ్డారు. బీరువా తెరిచి మంగళహారతులు,కాళ్ళ పట్టీలు, మొలతాడు, దాదపు 55 తులాల వెండి, 16,500 విలువ గల వస్తువులు ఎత్తుకెళ్లినట్టు రమణారెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, మార్చి 2: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో వెంకటేష్, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ పర్యవేక్షించారు.

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

హుజూరాబాద్‌రూరల్, మార్చి 2: మండలంలోని ధర్మరాజుపల్లి, రాంపూర్, సిర్సపల్లి గ్రామాల్లో శనివారం జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ డి. శ్రీలత, డాక్టర్ బి. శ్రీనివాస్, డాక్టర్ బలరాం, డాక్టర్ సాయినాథ్‌లు పర్యటించారు. వరిలో పిలక దశలో మొగి పురుగు ఆశిస్తే పిలకలు ఎండి చనిపోతాయని, వరి పిలక దశలో కార్టప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రా. 160-200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అగ్గి తెగుల నివారకు ట్రై సైక్లోజోల్ ఎకరానికి 120 గ్రా. పిచికారి చేయాలన్నారు. ఏడీఏ సునీత, ఏవో సునీల్‌కుమార్, ఏఈవోలు ఉన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి, మార్చి 2: పట్టణంలో అక్రమంగా నిలువ చేసిన రేషన్ బియ్యంను శనివారం ఎస్సై చిరంజీవి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణంలోని శాంతి నగర్ కాలనీకి చెందిన కొండపల్లి మల్లయ్య ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యంను నిలువ చేసిన పక్క సమచారం మేరకు దాడులు చేయడం జరిగిందన్నారు. పట్టణాలు, గ్రామాల్లో తన మనుషులతో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన వాటిని తన ఇంట్లో నిలువ చేసి వాటిని ఇతర ప్రదేశాలకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచారు. విషయం తెలుసుకొని దాడులు నిర్వహించగా అక్రమంగా నిలువ చేసిన 20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకొని సాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యం నిలువ చేసిన కొండపల్లి మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యంను రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.


మెట్‌పల్లిలో నిల్వ చేసిన రేషన్ బియ్యం

సిరిసిల్ల డీఎస్పీగా చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం మార్చి 2: సిరిసిల్ల డీఎస్పీగా కె చంద్రశేఖర్‌రెడ్డిని నియమిస్తూ డీజీపీ రవిగుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న భీం శర్మను జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఏఎస్పీగా బదిలీ చేశారు.

ఎల్లారెడ్డిపేట సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్



వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 2: ఎల్లారెడ్డిపేట సర్కిల్ సిఐగా శ్రీనివాస్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన శశిధర్ రెడ్డి మందమర్రి సిఐగా బదిలీ అయ్యారు. భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఎల్లారెడ్డిపేట సీఐగా నియమితులయ్యారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్సీకి లేదు

సిరిసిల్ల టౌన్, మార్చి 2: మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు లేదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ముందు ఉండి పోరాటాలు చేసి తెలంగాణ సాధనలో కీలక పాత్రను పోషించడన్నారు. బంగారు తెలంగాణ సాధనలో భాగంగా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొచ్చిన ఘనత కేటీఆర్‌దే అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మట్టె శ్రీనివాస్, నవీన్, సుజిత్, వంశీ, సందీప్, కరుణాకర్, వివేక్, వేణు, అజయ్, విఘ్నేష్, అక్షయ్, మల్లేశ్, జగన్, స్వామి పాల్గొన్నారు.

రుద్రంగి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు

రుద్రంగి, మార్చి 2 రుద్రంగి అభివృద్ధి కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక నిధులు కేటాయించారని డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధిలో భాగంగా రూ. 59 లక్షల నిధులు మంజూరు చేయగా వాటిలో మహిళ సంఘ భవనం, ప్రభుత్వ పాఠశాల, కళశాలలో ప్రహరీ నిర్మాణం , బోర్ మోటర్, మార్కెట్, కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిదులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పిడుగు లచ్చిరెడ్డి, తర్రె లింగం, స్వర్గం పరందామ్, పూదరి మహిపాల్, పుట్కపు మహిపాల్, అట్టపల్లి మల్లేశం, ఎర్రం అరవింద్, ఓద్యారపు రమేష్, దాను పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

రుద్రంగి, మార్చి 2 విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వంటగదిలో కూరగాయలను, బియ్యంను శనివారం ప్రజాప్రతినిధులు పరిశిలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, భోజనం విషయంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని భోజన నిర్వాహకులను సూచించారు. ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

సిరిసిల్ల రూరల్, మార్చి 2: ఇంటర్మీడియేట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 3,655 మంది విద్యార్థులకు గాను 3,545 మంది హాజరుకాగా 110మంది గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 3,358 మంది విద్యార్థులకు గాను 3,262 మంది విద్యార్థులు హాజరుకాగా 96 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 297 మంది విద్యార్థులకు 283 మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరయ్యారు.

మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



బోనాలతో మహిళలు

ముస్తాబాద్, మార్చి 2: ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన మైసమ్మ ఆలయ కమిటీ వార్షికోత్సవ వేడుకల అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయం వద్ద ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందల సంఖ్యలో గ్రామ పజలు పెద్దఎత్తున బోనాలు తీశారు. బైండ్లవారి ఆటలు, శివసత్తుల పూనకాల మధ్య ప్రధాన రహదారి మొత్తం బోనాల మయంగా మారింది. అలాగే పోచమ్మ బోనాలు తీశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, బండారి సత్తయ్య, పిట్ల విఠల్, పుల్లూరి రవి, వేముల అంజనేయులు, బద్దిపడిగె శ్రీను, రాజు, శేఖర్, రమేశ్, అనమేని రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్‌కు పత్తిపాక మోహన్

సిరిసిల్ల రూరల్, మార్చి 2 : కేంద్ర సాహిత్య అకాడమీ అధ్వర్యంలో నిర్వహించే అతిపెద్ద సాహిత్యోత్సవం ఫెస్టివల్ అఫ్ లెటర్స్‌కు సిరిసిల్లకు చెందిన కవి, బాల సాహితీవేత్త డాక్టర్ పత్తిపాక మోహన్‌ను ముఖ్యఅతిథిగా అహ్వానించింది. మార్చి 11నుంచి 16వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే ఈ ఉత్సవంలో 200 భాషాల నుంచి ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొంటున్నారు. పత్తిపాక మోహన్ 14వ తేదీన జరిగే భారతీయ భాషల్లో బాల సాహిత్యం సదస్సులో తెలుగు, దక్షిణభారత బాషలబాల సాహిత్యం, వికాసంపై మాట్లాడుతారు. మోహన్‌తోపాటు మరో ఐదుగురు వ్యక్తులు ఈ సదస్సులో బాలసాహిత్యంపై ప్రసంగాలు చర్చల్లో పాల్గొనున్నారు. 1100 దేశవిదేశీ భాషల రచయితల్లో పత్తిపాక ఒక్కరే తెలుగు బాల సాహితి వేత్తగా పాల్గొంటున్నారు. మోహన్‌కు మానసం అధ్యక్షుడు టీవీ నారాయణ, ప్రధాన కార్యదర్శి అడెపు లక్ష్మణ్, రాజన్న సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలుగొండ రవి, ప్రధానకార్యదర్శి పర్శరాములు, జిందం అశోక్, వెంగళ లక్ష్మణ్, భూమేష్, దేవానందం, కిరణ్‌కుమార్, అనిత, సౌమ్య, గణేష్, వంశీ, రవి, మహేష్ అభినందించారు.

ఎస్సీ బాలుర వసతి గృహం సందర్శన

చందుర్తి, మార్చి 2: మండల కేంద్రంలో ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో స్టోర్ రూమ్స్, విద్యార్థులకు అందిస్తున్న వంట సామాగ్రిని పరిశీలించారు, స్టాక్ రిజిస్టర్, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చందుర్తిలో ఉన్న అద్దె భవనం అరకొర వసతులతో ఉందని వెంటనే ఇతర భవనంలోకి మార్చాలని ఆదేశించారు. చందుర్తి మండల కేంద్రంలో మరో అద్దె భవనాన్ని పరిశీలించారు. అయన వెంట వార్డెన్ రవీంద్ర తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన మహిళలకు సన్మానం

చందుర్తి, మార్చి 2: చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంచ వనజ అనే మహిళ రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనందున మండల రెడ్డి సంఘం, యూత్ రెడ్డి సంఘం సభ్యులు. శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల రెడ్డి సంఘం అధ్యక్షులు దూది శ్రీనివాస్ రెడ్డి, యూత్ వింగ్ అధ్యక్షుడు పూదూరి జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పూదూరి ప్రశాంత్ రెడ్డి, కూతురు మహేందర్‌రెడ్డి, దారం హన్మంతరెడ్డి ఆశిరెడ్డిపల్లిరెడ్డి సంఘ అధ్యక్షులు నల్మాస్ రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దు

ఇల్లంతకుంట, మార్చి 2: నిబంధనల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోరాటాల సాధించుకున్న తెలంగాణ నిముషం నిబంధనతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం అన్నారు. ఏఉద్యోగి సమయానికి హాజరుకావడం లేదని, మరి ఇలాంటి నిబంధన విద్యార్థులకే ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. పరీక్షా సమయానికి సరైన రవాణాసౌకర్యం ఉండటం లేదని అందువల్లనే నిబంధన తొలగించాలని కోరారు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 2: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గంభీరావుపేట మండలం మల్లుపల్లెకు చెందిన మరాఠీ రవి కుమార్ కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. తలకు బలమైన గాయంకావడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ లోని ఆసుపత్రికి తరలించారు.

ఆక్స్‌ఫర్డ్‌లో అలరించిన వార్షికోత్సవం

గంభీరావుపేట, మార్చి 2: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ, సైన్స్ ఫెయిర్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను తయారుచేసి ప్రదర్శిం చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి







కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, జడ్పీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ తదితరులు, సిరిసిల్ల సర్దాపూర్ పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జడ్పీ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతిలతో పాటు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీపాదరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జడ్పీ సీఈవో ఉమారాణి, డీవైఎస్‌వో రాందాస్, డిప్యూటీ సీఈవో మచ్చ గీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు సార్లు ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా శ్రీపాదరావు సేవలందించి ప్రజల మన్ననలు అందుకున్నారని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలపరిషత్ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్య యాదవ్, పుష్పలత, కాథ సుమలతమల్లేశం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయమని, ఆయన చివరి శ్వాస వరకు ప్రజల కోసం పోరాడిన వ్యక్తి అని సింగిల్ విండో వైస్‌చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పాటు రాచర్ల గొల్లపల్లిలో శ్రీపాదరావు జయంతి సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్‌పరిధిలోని సర్ధాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియనలో శ్రీపాదరావు చిత్రపటానికి కమాండెంట్ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అర్ఐలు రఘునాథన్, నారాయణ, నేమాజీ, పరిపాలన అధికారి ప్రమీల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలోని తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో, రామన్నపేటలో దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. రామన్నపేటలో మాజీ సర్పంచ్ భీమరాజు కళ్యాణి కనకరాజు ఆధ్వర్యంలో పండ్లు, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





రామన్నపేటలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు, ఎల్లారెడ్డిపేటలో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

సెస్‌లో అవినీతిని అరికట్టేందుకు చర్యలు

సిరిసిల్ల రూరల్, మార్చి 2: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థలో అవినీతిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. సిరిసిల్ల సెస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. విద్యుత్ కొనుగోలు చేసిన బకాయిలు పేరుకపోయాయని అ సంస్థ పని చేయడం కష్టంగా ఉందని దీనిని ప్రభుత్వంలో విలీనం చేయాలని మాత్రమే తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటి రెగ్యూలటరీ కమిటి ప్రభుత్వానికి సలహా ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, సెస్‌ను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని నమ్ముతున్నామన్నారు. త్వరలోనే బకాయిలను వసూళ్లు చేసి సంస్థను కాపాడుకుంటామన్నారు. సంస్థలో అవినీతిని అరికట్టేందుకు ఒకేసారి 13 మంది సిబ్బందిపై చర్యలు తీసుకున్నామన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో నూతనంగా నిర్మించిన భవనాల్లో వాటికి ఉండాల్సిన కరెంట్ మీటర్లకంటే అధికంగా ఉన్నాయన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కరెంట్ మీటర్‌లను వినియోగించుకునేందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 2: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి సమాజంలో పేరు ప్రఖ్యాతులతో పాటు ఉద్యోగాలను సాధించుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సెలస్టియల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శనివారం రాత్రి వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా జడ్పీ చైర్ పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, కౌన్సిలర్ ఆకుల కృష్ణ, మండల విద్యాధికారి రఘుపతి, సైన్స్ జిల్లా అధికారి పాముల అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మంచి పనులు
ప్రజల గుండెల్లో నిలిచిపోతాయి

ముస్తాబాద్, మార్చి 2: ప్రజలకు చేసిన మంచి పనులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎంపీపీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. మండ లంలోని బందనకల్‌లో గల పెద్ద చెరువు వారం రోజుల్లో కాళేశ్వరం జలాలలో నిండి సాగు నీరు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. కాలువ ద్వారా నీటిని విడిచిన సందర్భంగా సిద్దిపేట జిల్లా సితారాంపల్లె, చింతమడక, మాచాపూర్ ద్వారా వస్తున్న నీటిని పరిశీలించారు. మట్టి ద్వారా నీరు వస్తుండటంతో కాలువలు భద్రంగా ఉండేలా పర్యవేక్షించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్ట ర్ సందుపట్ల అంజిరెడ్డి, బీఆర్‌ఎస్‌మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, మాజీ సర్పంచ్ సడిమెల ఎల్లం, ఎంపీటీసీ రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 2: బీఆర్‌ఎస్ నాయకులు మితిమీరి మాట్లాడుతున్నారని నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప మాట్లాడారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు గ్యారెంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని మాది ప్రజాపాలన అని దొరల గడీల పాలన కాదన్నారు. చిన్నపాటి చినుకులు పడితే సిరిసిల్ల పట్టణం సగం జలమయం అవుతోందని, సిరిసిల్ల దళితుల భూములను లాక్కోవడం అభివృద్ధి అంటారా అని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటీఆర్ ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి హద్దులు మీరి మాట్లాడుతున్నారని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడ ఉన్నాడని అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేకే మహేందర్ నియోజవర్గం ఇన్‌చార్జీగా ఉండి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించింది గుర్తు చేసుకోవాలన్నారు. సిరిసిల్లలోని గిరిజన హాస్టల్‌లోని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిన మీరు కేకే మహేందర్‌రెడ్డిని విమర్శిస్తారా అన్నారు. ఆ విద్యార్థుల కోసం, బాధిత దళితుల కోసం మీరెప్పుడైన కొట్లాడారా అని ప్రశ్నించారు. సిరిసిల్ల ప్రాంతంలోని గుట్టలు, భూములు, వాగులో ఇసుకను బీఆర్‌ఎస్ నాయకులు అమ్ముకున్నారని ఆరోపించారు. రెండు నెలల్లో కార్మికులకు పనికల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 64లక్షలు ఆర్వీఎం కు ఆర్డర్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి రామానుజం, కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నక్క నర్స య్య, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం, మాజీ కౌన్సిలర్ రాగుల జగన్ నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: దమ్ముంటే దోచుకున్న సొమ్ములో నుంచి ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 50లక్షల అర్థిక సహాయం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2001 నుంచి ఇప్పటి వరకు ప్రజల మధ్యలో ఉండి వారి సమస్యలపై కొట్లాడిన వ్యక్తి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నిసార్లు ఓడినా ఇక్కడి ప్రజలను వదిలి వెళ్లలేదన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగిన అఘాయిత్యాలపై నోరువిప్పని బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు మాట్లడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మరోసారి కేకేపై అనుచిత వ్యాఖ్యాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గుగ్గిళ్ల శ్రీకాంత్, ఇటిక్యాల మహేందర్, చుక్క శేఖర్, బాలు పాల్గొన్నారు.

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట): కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై తోట ఆగయ్య మాట్లాడుతున్న మతిలేని మాటలను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూడిద రాజేందర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తోట ఆగయ్య స్థాయికి మించి వ్యాఖ్యలు చేయడం సరికాదని హెచ్చరించారు. మహేందర్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాటలు మాట్లాడితే ప్రజల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తోట ఆగయ్య ఆస్తులు కూడపెట్టుకుని కోటీశ్వరుడుగా మారడని పేర్కొన్నారు. మహేందర్‌రెడ్డి ఆస్తులు అమ్ముకొని పేద ప్రజల పక్షాన అండగా నిలబడుతున్నారని అన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, చెన్ని బాబు, రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న వినోద్

బోయినపల్లి, మార్చి 2: ఆచరణకు సాధ్యం కానీ.. అబద్ధాల హామీల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేయాలని, యాసంగి పంటలకు క్వింటాలుకు రూ 500 బోనస్ ఇవ్వాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని వెంకట్రావు పల్లిలో మండల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని, బీఆర్‌ఎస్ కార్యకర్తలందరికి పార్టీ అండగా ఉంటుందని.. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, జడ్పీటీసి ఉమాకొండయ్య, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

ముస్తాబాద్: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని ఎంపీపీ జనగామ శరత్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, జడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఎంపీటీసీలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట): విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని పాఠశాల 1982-83 బ్యాచ్ పూర్వ విద్యార్థి, రాజరాజేశ్వర ఆవాస విద్యాలయం కరస్పాండెంట్ రాధాకృష్ణమాచార్యులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు బోర శ్రీనివాస్ రాసిన స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో 10 జీపీఏ సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను అందించడం పట్ల ఆయనను ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మనోహరచార్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శనివారం బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెంద్రం తిరుపతిరెడ్డి డెస్కులను వితరణ చేశారు. కళాశాలలో డెస్కుల కొరత ఉందని తెలుసుకొని అందించినట్లు తెలిపారు. విద్యార్థుల చదువుల కోసం ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బండారి రాజు, బొల్లారం ప్రసన్న, మామిడి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం భూక్యతండాకు చెందిన యువకులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. యువకులు వారిలో రఘుపతి, బలరాం, మోహన్, సంతోష్, ప్రధానోపాధ్యాయులు సంపత్, ఉపాధ్యాయురాలు అనిత తదితరులు ఉన్నారు.

రుద్రంగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రుద్రంగి మండలంలో ఆనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని జడ్పీటీసీ గట్ల మీనయ్య అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ జీమ్ ఏర్పాటుకు శనివారం ప్రజాప్రతినిధులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, మాజీ సర్పంచ్ లు తర్రె ప్రభలతమనోహర్, వడ్ల నారాయణ, చేప్యాల గణేష్, పాల నర్సయ్య, గొల్లెం నర్సింగ్, మ్యాకల రాజేందర్, మరిగడ్డ సతీష్, నర్సయ్య, నాగులపల్లి రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన పెంపొందించాలి





సిరిసిల్లలో సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న డీఈవో

సిరిసిల్ల రూరల్, మార్చి 2: విద్యార్థులకు సైన్స్‌పై అవగహనను పెంపోదించడంతోపాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ సంబరాలను నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో విద్యార్థులు తయారు చేసిన 154 సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను పరిశీలించారు. హ్యూమన్ హెల్పింగ్ రోబోట్, అటోహోమ్ మిషన్, అర్ఎఫ్ఐడి అటెండెన్స్ రేయిన్ వాటర్ స్టోరేజ్, లెట్‌డెత్ పీపుల్ అలర్ట్, చంద్రయాన్, కారులు పార్కింగ్‌లతోపాటు తదితర ఎగ్జిడిట్‌ల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తయారు చేసిన విద్యార్థుల తోపాటు సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసానాలకు అలవాటు పడకుండా ఉన్నత లక్ష్యంతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించేస్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని సైన్స్ ఎగ్జిబిట్‌లను తయారు చేసేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు.

● విజేతలు వీరే...

శివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాల్లో విజేతలు విద్యార్థులు నిలిచారు. అందులో అర్ఎఫ్ఐడీ అటెండెన్స్ సిస్టంను చేర్యాల శివతేజ, వడ్డెపల్లి లవన్‌కుమార్, హ్యూమన్ హెల్పింగ్ రోబోట్‌ను సాయితేజా, అజయ్, అటో హోమ్ మిషన్‌ను అఖిల, జాబిల్లి, రెయిన్ వాటర్ స్టోరేజీ సిస్టంను శివ, దత్రష్, వివేక్, డెఫ్ పీపుల్ అలర్ట్ సిస్టంను రాజేశ్వరి, వర్షిత తయారు చేసి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, మండల విద్యాధికారి దూస రఘుపతి, ప్రధానోపాధ్యాయులు లాకవత్‌మోహన్‌లాల్, నాగుల భాగ్యరేఖ, లోకిని శారద, పాఠశాల స్టాఫ్ కార్యదర్శి మల్లారపు పురుషోత్తం, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: సైన్స్ నిత్య జీవితంలో ఓ భాగం అయ్యిందని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, సిరిసిల్ల మున్సిపాల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శుభోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్, ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమాలను డీఈవో, మున్సిపాల్ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన కృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు. అలాగే విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వంటలను రుచి చూశారు. కార్యక్రమంలో ఎంఈవో రఘుపతి, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌యాదవ్, ప్రిన్సిపాల్ గంప సుధాకర్ పాల్గొన్నారు.